క్లుప్తంగా

శివాజీ విగ్రహానికి స్థలం కేటాయించాలి



కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం ఇస్తున్న హిందూ ఉత్సవసమితి సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఐలాండ్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహ స్థాపనకు స్థలం కేటాయించాలని కోరుతూ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెరబెల్లి రఘునాథ్‌రావు, చంద్రశేఖర్ శెట్టి(గీత భవన్), కర్ణకంటి రవీందర్, సత్యరెడ్డి, సందీప్, అమర్నాథ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆదిల్‌పేట్‌లో కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న రాజస్థాన్ రాష్ట్ర మంత్రి

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజస్థాన్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి మహేంద్రసింగ్ మాల్యా హాజరై ఇంటింటికీ తిరిగి గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తూ ప్రజలకు భరోసా ఇచ్చారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీసీసీ మెంబర్ నూకల రమేష్, మండల అధ్యక్షుడు నీలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్, నాయకులు ఉన్నారు.

'సుమన్‌ను ఓడించడానికే కాంగ్రెస్‌లోకి వచ్చా..'

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఓడించడానికే సింగరేణిలో తన ఉన్నతమైన వైద్య వృత్తిని వదులుకొని కాంగ్రెస్ పార్టీలోకి వచ్చానని డాక్టర్ రాజారమేష్ స్పష్టం చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతో కొందరు బీఆర్‌ఎస్ నేతలు మంతనాలు జరిపారనే విషయాన్ని ప్రస్తావిస్తూ, అతి త్వరలో ఆ పార్టీని వీడి సుమన్ అనుచరులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని వివరించారు. కొందరు గిట్టనివారు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చెన్నూర్ నియోజకవర్గంలోని జాతి సంపదను సుమన్ దోచుకున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గోపతి రాజయ్య, శ్రీనివాసరెడ్డి, ఎల్లయ్య, లింగయ్య, రవీందర్, లాజర్, హరీష్, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన పాగాల కాటమయ్య అనే రైతుకు చెందిన ఆవు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందింది. ఉదయం మేత మేస్తున్న సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందగా స్థానిక రైతులు గమనించి రైతుకు సమాచారం అందించారు. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని నష్టపరిహారం అందజేయాలని రైతు కోరారు.

ఎస్సీ వర్గీకరణ కోసం కొనసాగుతున్న దీక్షలు

చెన్నూర్: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మంత్రి మల్లేశ్, నాయకులు మంద రవి, చింతం సుధాకర్, సుంధిళ్ల నవీన్, గాలిపల్లి సత్యనారాయణ, రాసపాక మల్లేశ్, రమేశ్, సుమంత్, సతీశ్, గట్టయ్య, నరేశ్ పాల్గొన్నారు.

లలితా పారాయణం



మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయంలో లలితా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం లలితా పారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మందమర్రిరూరల్: పూజలో పాల్గొన్న సీఐ, ఎస్సై



జన్నారం: పొనకల్‌లో వినాయకుడికి పూజలు



తాండూర్: పూజలు చేస్తున్న మహిళలు



జైపూర్: నర్వలో పూజ చేస్తున్న దంపతులు



బెల్లంపల్లి: వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కొలువుదీరిన గణనాథుడు

బెల్లంపల్లి/జన్నారం/నస్పూర్/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/చెన్నూర్/భీమిని/బెల్లంపల్లిరూరల్/భీమారం/జైపూర్/లక్సెట్టిపేట/కాసిపేట/మందమర్రిరూరల్/తాండూర్: వినాయక చవితిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం మండపాల్లో విఘ్నేశ్వరుడి ప్రతి రూపాలను ఏర్పాటు చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో ఏర్పాటు చేసుకుని పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. రకరకాల ఆకృతుల్లో, భారీ సైజ్‌ల్లో తయారు చేసిన విగ్రహాలను పోటీపడి ప్రతిష్ఠించారు. నవరాత్రులు వినాయకుడికి పూజలు జరగనున్నాయి. మండపాల నిర్వాహకులు ప్రత్యేక కార్యాచరణ తయారు చేశారు. పొనకల్‌లోని వర్తక సంఘం వినాయక మండపం వద్ద నవరాత్రోత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజూ అన్నదానం ఉంటుందని అధ్యక్షుడు మారుతిరాజ్, ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. విద్యార్థులు, కుల సంఘాలు యువకులు గణేశ్ మండళ్లను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. మందమర్రి మార్కెట్ సెంటర్లో సింగరేణి సహకారంతో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన భారీ విగ్రహం వద్ద సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ దంపతులు పూజలో పాల్గొన్నారు.



భీమిని: మట్టి గణపయ్యకు పూజలు



శ్రీరాంపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



దండేపల్లి: అంగడిబజారులో...



దుగ్నెపల్లిలో వినాయకుని వద్ద పూజలు



చెన్నూర్: పద్మశాలి గణేశ్ మండలి వద్ద...

'సార్లూ.. ఆదుకోండి'

కాసిపేట: పట్టా చేయిస్తానని తీసుకెళ్లి తమ భూమిని పట్టా చేయించుకొని మోసం చేసినట్లు మండలంలోని ముత్యంపల్లికి చెందిన బరిగెల ఆశయ్య, లక్ష్మి దంపతులు వాపోయారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారి బాధను చెప్పుకున్నారు. పెద్దనపల్లి శివారులో సర్వేనంబర్ 5/61లో 8ఎకరాల భూమి ప్రభుత్వం తమకు అసైన్డ్ చేసిందన్నారు. పెద్దనపల్లి పంచాయతీ సోమగూడెంకు చెందిన ఉప్పులేటి శ్రీనివాస్ భూమి అమ్మాలని పలుమార్లు కోరగా తిరస్కరించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇంటిచుట్టూ తిరుగుతూ పట్టా పాసుపుస్తకం ఇప్పిస్తా అని కార్యాలయానికి తీసుకెళ్లి, అతడి పేరు మీద, అతడి భార్య పేరు మీద పట్టా చేయించుకున్నట్లు ఆరోపించారు. అధికారులు, శ్రీనివాస్ కలిసి తమ బ్రతుకులు ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు తెలియకుండా పట్టా చేసుకున్న విషయంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై శ్రీనివాస్‌ను విలేకరులు ఫోన్‌లో సంప్రదించగా నేను వారి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు.

'పండుగ పూట పీహెచ్‌సీకి సెలవు'

వేమనపల్లి: పండుగ పూట వేమనపల్లి పీహెచ్‌సీ సిబ్బంది అప్రకటిత సెలవు ప్రకటించుకున్నారు. పీహెచ్‌సీ తెరిచే ఉంచినా, సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాలేదు. బొమ్మెన గ్రామానికి చెందిన కోర్తె శైలజ కుక్క కాటుకు గురై వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చారు. 4గంటలు పీహెచ్‌సీ వద్ద వేచి ఉన్నా ఎవరూ లేరు. టీకా వేసే వారు లేకపోవడంతో కంటిజెంట్ వర్కర్ బాపుయాదవ్ రేబిస్ వ్యాక్సిన్‌ను రోగికి అందజేశారు. దగ్గరలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడు సత్యనారాయణ వద్దకు వెళ్లి టీకా వేయించుకుంది. పండుగ పూట విధుల్లో ఉండాల్సిన సిబ్బంది లేకపోవడంపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



కాసిపేటలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



నెన్నెలలో సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ అధ్యక్షురాలు

భీమిని: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని భీమిని, కన్నెపల్లి మండలాల్లో నిరవధిక సమ్మె చేపట్టారు. మంగళవారం 9వ రోజు తమ సమస్యలను పరిష్కరించాలంటూ పాటల రూపంలో పాడి నిరసన తెలియజేశారు.

నెన్నెలలో సీఐటీయూ మద్దతు..

నెన్నెల: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, జిల్లా కోశాధికారి రాజమణి, మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకురాలు రొడ్డ శారద మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన

కాసిపేట: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం కొనసాగింది. దీక్ష శిబిరంలో అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

తాండూర్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించి కాంగ్రెస్ శ్రేణులు దీక్షలో కూర్చున్నారు.

'కొక్కిరాల' ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, నంనూర్, గుడిపేట, చందనాపూర్, నర్సింగాపూర్, రాపల్లి గ్రామాల్లోని మహిళలకు మంగళవారం కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మండల అధ్యక్షుడు తోట రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంట రజిత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీటీసీలు ఒడ్డె బాలరాజు, డేగ బాపు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి నాయికిని సురేందర్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ముల్కల్ల గ్రామానికి చెందిన పలువురు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ కుశ్నపల్లి సుగుణ, కానుగంటి రేవతి, ఆవుల నీరజ, ఆవునూరి లక్ష్మి, దొడ్డ రాజేశ్వరి, చిప్పకుర్తి రాజేశ్వరి, ఆవుల దేవక్క, ఆవునూరి విజయ, దొడ్డ భాగ్య, రొడ్డ అమ్మాయి, గుడిసెల పోచమ్మ తదితరులు ఉన్నారు.



ముల్కల్లలో చీరలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

'డిక్లరేషన్‌తో అధికార పార్టీలో గుబులు'

జన్నారం: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ అధినేత్రి సోనియగాంధీ చేసిన 6హామీల డిక్లరేషన్‌తో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి గుబులు పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. గతంలో కూడా మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చి దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి మాటతప్పని మనిషిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, హేమంత్‌చారి, ముజ్జు, రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి, షుగర్ పరీక్షలు

బెల్లంపల్లి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతిఖని, 65డీప్ ఏరియా బస్తీ వాసులకు ఉచితంగా కంటి, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. శాంతిఖని బస్తీలోని ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ప్రత్యేకంగా క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 80మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం అవుతాయని గుర్తించారు. వీరికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. బీపీ, షుగర్ ఉన్న వ్యక్తులకు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.తిరుపతి రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కుక్కల నర్సయ్య, నిర్వాహకులు సత్యనారాయణ, దుద్దిళ్ల నారాయణరావు, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, కంటి వైద్య నిపుణుడు అంజయ్య, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు నారాయణ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే పర్యటన

దండేపల్లి: మండలం వెల్గనూర్‌లో ఎమ్మెల్యే దివాకర్‌రావు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, అందరినీ ఆప్యాయంగా పలకరించి, బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వృద్ధులతో మాట్లాడి, పింఛన్ గురించి వివరించారు. గ్రామంలో వాడవాడలా తిరిగి ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉన్నారు. గూడెం, రంగంపల్లె గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బొగ్గుబాయి వార్తలు

సమీక్షా సమావేశం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనుల సంక్షేమ అధికారులుతో జీఎం సంజీవరెడ్డి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు వారి అర్హతలను బట్టి టైంరేటెడ్ ప్రమోషన్లు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా కల్పించే ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, అధికారులు రాజేశ్వర్‌రావు, రాజేశ్, దేవేందర్‌రెడ్డి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

శ్రీరాంపూర్: పోటీలతోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికితీయొచ్చని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఇదివరకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జీఎం చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో పడిపోయిన విద్యుత్ సంభం చోట కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. మినీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. 'పడిపోయినా పట్టించుకోరా' అనే శీర్షికన ఈ నెల 17 న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి ఏఈ లచ్చన్న స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పడిపోయిన స్తంభం చోట కొత్త స్తంభం అమర్చి, మినీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కలమడుగు గ్రామస్తులు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.



స్తంభం అమరుస్తున్న విద్యుత్ సిబ్బంది

పాటల సీడీ ఆవిష్కరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన దివంగత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ పాటల సీడీ లోగోను ఆవిష్కరించారు. స్థానిక కొత్తబస్టాండ్ ఏరియాలో నివాసం ఉంటున్న సుదర్శన్ చిన్న తమ్ముడు కటకం సతీష్‌కుమార్ ఇంట్లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిలివేరి సత్యనారాయణ, నాయకుడు నాతరి స్వామి, సతీష్‌కుమార్, జమున 'తొలితరం విప్లవ సూర్యుడు' పేరుతో సీడీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం పాటను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో పాట రచయిత వెంకటరమణ, గాయకురాలు మమత, ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు ఆడేపు సమ్మయ్య, ప్రజా స్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్ బండి దుర్గాప్రసాద్, స్థానికులు నాగుల నారాయణ, సోగాల రవి, కన్నూరి వెంకటేష్ పాల్గొన్నారు.



సీడీ ఆవిష్కరిస్తున్న సతీష్, ఇతర శ్రేణులు

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల వినతి

పాతమంచిర్యాల: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, జీతాలు పెంచాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కార్మికులు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నట్లు, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి కార్మికుల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, కార్మికులు శంకరయ్య, రవి, రామయ్య, సారయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

'బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి'

భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ హాజరై మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు.

ఇంటింటికీ వెళ్లి...

సంక్షేమ పథకాలు వివరించి..

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో మంగళవారం ఇంటింటికీ వెళ్లి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేత వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

పిచ్చిమొక్కల తొలగింపు

వేమనపల్లి: మండలంలోని కల్మలపేటలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సంగెం పవన్, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో కల్మలపేటలోని యూపీఎస్ పాఠశాల వద్ద మంగళవారం పిచ్చిమొక్కలు తొలగించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: మున్సిపల్‌లో పనిచేసే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే చలో కలెక్టరేట్ పోస్టర్‌ను మంగళవారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఆవిష్కరించారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని కర్ణమామిడిలో మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఉచితంగా గర్భకోశ చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు సోమవారం గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోటపల్లి: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల లక్సెట్టిపేటలో నిర్వహించిన అండర్18 అథ్లెటిక్స్ పోటీల్లో కోటపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన బతుకక్క 800మీటర్ల విభాగంలో రన్నింగ్‌లో ప్రథమ శ్రేణిలో నిలువగా, 1500మీటర్ల అథ్లెటిక్ విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. 400మీటర్ల విభాగంలో కృష్ణవేణి ప్రథమ స్థానంలో నిలువగా, 800మీటర్ల విభాగంలో ద్వితీయస్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు రాజయ్య, రమణ, సురేందర్, కృష్ణ, శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. 14వ తేదీన మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని 13మంది విద్యార్థినులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వీరిని పాఠశాల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సర్కస్ ఫీట్లు అనుకుంటే పొరపాటే..

దండేపల్లి: ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం చూసి ఏదో సర్కస్ ఫీట్లు అనుకుంటే పొరపాటే. దండేపల్లి మండలంలోని మేదరిపేటలో సోమవారం విద్యుత్ వైరు తెగిపడింది. మరమ్మతు చేసేందుకు విద్యుత్ సిబ్బంది ఇలా ట్రాక్టర్ ట్రాలీపై నిలబడగా జాకీ సిస్టంతో పైకి లేపడంతో మరమ్మతు చేశారు.

